

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సదాశివపేట/సంగారెడ్డి, అక్టోబర్ 28: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మండలానికి చెందిన 38 మందికి, పట్టణానికి చెందిన 28 మందికి రూ.16 లక్షల 41వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం, కౌన్సిలర్లు సాతాని శ్రీశైలం, ఇంద్ర మోహన్‌గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్, శేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మాధవరెడ్డి, సుధాకర్, లలిత, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.

ఎద్దు గానుగ నూనె తయారీ కేంద్రం ప్రారంభం

సదాశివపేట మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఎద్దు గానుగ నూనె తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతాప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎద్దు సహాయంతో తయారు చేసిన నూనె ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో ప్రొప్రైటర్ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజనేయులు, సుదీర్ రెడ్డి, నాగేశ్, బాబూజీ, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, నవీన్ పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో దిగ్వాల్ విద్యార్థుల హవా

పతకాలతో దిగ్వాల్ గురుకుల విద్యార్థులు

కోహీర్, అక్టోబర్28: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో దిగ్వాల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని ప్రిన్సిపాల్ హరీశ్వర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన క్రీడాపోటీల్లో సూర్యకిరణ్ చెస్‌లో ఫస్ట్ ప్లేస్‌ను కైవసం చేసుకున్నాడని తెలిపారు. అజయ్, ప్రణీత్, వినోద్‌కుమార్, గోపీసింగ్, మహబూబ్, నరేశ్, సాయికుమార్ కబడ్డీలో ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. పదో తరగతి విద్యార్థి నవీన్ 100మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు, లాంగ్ జంప్, డిస్కస్ త్రో పోటీల్లో జిల్లా స్థాయిలో అగ్రభాగాన నిలిచాడని కొనియాడారు. హైజంప్‌లో ద్వితీయ స్థానం పొందాడన్నారు. అజయ్ 200మీటర్లు రన్నింగ్, షాట్‌పుట్‌లో మూడో స్థానం సాధించారన్నారు. సంగమేశ్వర్ 1500మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానంలో నిలిచాడన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు రమేశ్, పీఈటీ ఈరయ్య, సుధీర్‌కుమార్, సిద్దయ్య అభినందించారు.

సదర్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సదర్ కమిటీ సభ్యులు

రామచంద్రాపురం, అక్టోబర్ 28: ఆర్సీపురంలో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని సదర్ కమిటీ అధ్యక్షుడు రాజు అన్నారు. సదర్ వేడుకల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్‌కు సదర్ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని 2వ తేదీన సాయంత్రం సండే మార్కెట్‌లో సదర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐలేశ్, భిక్షపతి, నర్సింహా, అశోక్, వెంకటేశ్, కుమార్, శ్రీరాములు, కుమ్మరి కుమార్, జితేందర్ పాల్గొన్నారు.

కార్యాలయాల నిర్మాణానికి స్థల పరిశీలన

తహసీల్దార్ రాధతో మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్ అక్టోబర్ 28: రానున్న రోజుల్లో అమీన్‌పూర్ పెద్ద పట్టణంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని నవ్య రోడ్డులో నూతనంగా నిర్మించనున్న పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు రెండు ఎకరాలు, పోలీస్‌స్టేషన్‌కు రెండు ఎకరాలు, మున్సిపల్ కార్యాలయానికి రెండు ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మూడు శాఖలు సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, తహసీల్దార్ రాధ, సీఐ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షం 'సీఐటీయూ'

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర, యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు

జిన్నారం, అక్టోబర్ 28: కార్మికుల పక్షాన పోరాడేది సీఐటీయూ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సోమవారం జరిగిన ఖాజీపల్లిలోని టీఐడీసీ పరిశ్రమ గేట్ మీటింగ్‌కు హాజరై మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, సౌకర్యాలు కల్పించేది సీఐటీయూ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశం, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సత్తయ్య, సుధాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించాలి

నారాయణఖేడ్, అక్టోబర్ 28: మిషన్ భగీరథలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని నారాయణఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి కోరారు. మూడు నెలలుగా వారికి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేతనాలు ఇవ్వకపోవడంతో పండుగల వేళ వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు.

జంట నగరాలకు ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు

సంగారెడ్డి, అక్టోబర్ 28: జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ఆర్టీసీ లాజిస్టిక్ సేవలతో హోమ్ డిలివరీ సర్వీసును ప్రారంభించామని ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ మేనేజర్ ప్రభులత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుబాటులో లాజిస్టిక్ ఇన్‌చార్జి ఇసాక్ బీన్ మహమ్మద్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ఉంటారని తెలిపారు.

సమయానికి సహకారం.. లబ్ధిదారులకు పింఛన్

బొల్లారం, అక్టోబర్ 28: బొల్లారం పాత మున్సిపల్ కార్యాలయం సోమవారం పెన్షన్‌దారులతో కిక్కిరిసిపోయింది. ఉదయం 5 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటల వరకు ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారుల అవస్థలను గుర్తించిన స్థానిక సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి పోస్ట్ ఆఫీస్ మేనేజర్‌ను ప్రశ్నించారు. మిషన్లు పనిచేయడం లేదని, ఒక్కోసారి సిగ్నల్స్ అందడం లేదని చెప్పడంతో సొంత ఖర్చులతో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. దీంతో పోస్టల్ అధికారులు సకాలంలో పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారులు, సిబ్బంది ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

నిద్రమత్తులో ఘోర రోడ్డు ప్రమాదం

- సదాశివపేట హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ
- ఇద్దరు క్లీనర్లు మృతి.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన దృశ్యం, పరిశీలిస్తున్న పోలీసులు

సదాశివపేట, అక్టోబర్ 28: సదాశివపేట పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నిద్రమత్తు, అతివేగంతో రోడ్డుపై నిలిచి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న(టీఎస్07యూఎఫ్ 9689) నంబర్ గల లారీకి టైర్ పంక్చర్ కావడంతో నిజాంపూర్ బైపాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నిలిపారు. లారీ క్లీనర్ టైర్లకు పంక్చర్ చేస్తుండగా అదే రోడ్డులో జహీరాబాద్ వైపు వెళ్తున్న (హెచ్‌ఆర్ 38ఏబీ 4704) లారీ వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీలకు చెందిన ఇద్దరు క్లీనర్లు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలతో లారీ క్యాబిన్‌లో చిక్కుకుపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ముగ్గురిని అతికష్టం మీద బయటకు తీశారు. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. మృతులు ఘట్కేసర్‌లోని అన్నాజిగూడకు చెందిన దీపక్, పరమేశ్వర్లుగా, గాయపడ్డ కంటెయినర్ డ్రైవర్ యోగేశ్, క్లీనర్ శేఖర్, దేవిసింగ్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

బైపాస్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 28: భారతీయ జీవిత బీమా సంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద లియాఫీ ఆధ్వర్యంలో ఏజెంట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లియాఫీ ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ మాట్లాడుతూ ఐఆర్‌డీఏను అడ్డుపెట్టుకొని ఎల్ఐసీ యాజమాన్యం ఏజెంట్లకు అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. వెంటనే ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 15 రోజులుగా ఎల్ఐసీ ఏజెంట్లు సహాయ నిరాకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు రమేశ్, ప్రభాకర్, సురేశ్, మధుసూదన్‌రెడ్డి, రవిబాబు పాల్గొన్నారు.

'నిమ్జ్'లో అధికారుల బదిలీ

కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 28: జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు యూనిట్-2 డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో రాజును బదిలీ చేస్తూ సోమవారం సంబంధిత జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మికి బాధ్యతలను అప్పగించారు. అనంతరం ఆయన సంగారెడ్డి ఆర్టీవోగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో యూనిట్-2 డిప్యూటీ కలెక్టర్‌గా శకుంతల రానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జహీరాబాద్ ఆర్డీవోగా పనిచేసిన ఎస్.రాజు మహబూబాబాద్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అక్కడి నుంచి రాంరెడ్డి జహీరాబాద్ ఆర్టీవోగా రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సంగారెడ్డి ఆర్డీవోగా రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 28: జిల్లా కేంద్రం సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారిగా రవీందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. సోమవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఆర్డీవోగా బదిలీ చేయగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నిమ్జ్-2గా డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన రవీందర్‌రెడ్డిని సంగారెడ్డి ఆర్డీవోగా బదిలీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు సేవ చేస్తానన్నారు. అనంతరం కలెక్టర్ క్రాంతిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సోలక్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

జిన్నారం, అక్టోబర్ 28: మండలంలోని వావిలాల, సోలకపల్లి గ్రామాల్లో వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌తో కలిసి వ్యవసాయాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం వావిలాల, సోలక్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. కార్యక్రమంలో వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగురమేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పటాన్‌చెరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ సంఘం ప్రతినిధులు

పటాన్‌చెరు, అక్టోబర్ 28: డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయులు పటాన్‌చెరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం తెలంగాణ ఉపాధ్యాయ ప్రాంత సంఘం (తపస్) రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు నాలుగు దశల ఉద్యమ కార్యాచరణను ఉపాధ్యాయ సంఘం ప్రారంభించింది. పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావుకు సంఘం సభ్యులు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. పది నెలలుగా ఉపాధ్యాయుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించలేదని, 100 రోజుల్లోనే కొత్త పీఆర్సీ అమలు చేస్తామన్న హామీని విస్మరించారన్నారు. నవంబర్ 23న ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్ దేశ్, జిల్లా కోశాధికారి రమేశ్, జిల్లా మండల బాధ్యులు దశరథ్, నర్సింహులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, అక్టోబర్ 28: పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం నారాయణఖేడ్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు మల్లికార్జున్, వినయ్‌కుమార్, చంద్రశేఖర్, చంద్రకాంత్, గంగారాం, రాజయ్య, రవీందర్, జగదీశ్వర్, నతన్‌సింగ్, దశరథం, ప్రతాప్ పాల్గొన్నారు.

టపాకాయల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

సంగారెడ్డి, అక్టోబర్ 28: దీపావళి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే టపాకాయల దుకాణాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. దుకాణాలను జనవాసాలకు దూరంగా పెట్టుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిశు, సఖి కేంద్రాల తనిఖీ

శిశుగృహలో వంటశాలను పరిశీలించిన న్యాయమూర్తి రమేశ్

సంగారెడ్డి, అక్టోబర్ 28: జిల్లా కేంద్రంలోని శిశు గృహ, సఖి, భరోసా కేంద్రాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సందర్శించారు. అందులో కల్పిస్తున్న వసతులపై ఆరాతీశారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిశుగృహలో పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని ఆదేశించారు.

లక్ష్మీనగర్‌లో పారిశుధ్య పనులు



లక్ష్మీ నగర్‌లో మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్న నాయకులు

బొల్లారం, అక్టోబర్ 28: మున్సిపాలిటీలోని 15వ వార్డు లక్ష్మీనగర్‌లో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది వార్డులోని మురుగు కాల్వలో పోగైన చెత్తాచెదారాన్ని తొలిగించి శుభ్రం చేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన కమిషనర్‌కు నాయకులు లక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ రూపేశ్‌కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 28: ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డేను ఈ నెల 29న హోప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు స్థానిక హోప్ న్యూరో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రూపేశ్ చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజల అవగాహన కోసం 3కే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29న ఉదయం 7 గంటలకు స్థానిక ఐబీ వద్ద జిల్లా ఎస్పీని 3కే రన్ ప్రారంభిస్తారని వెల్లడించారు. ఐబీ నుంచి ప్రారంభమైన కలెక్టరేట్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రన్ కొనసాగుతుందన్నారు. ఈ 3కే రన్‌కు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జీవాల పెంపకం లాభదాయకం

జహీరాబాద్, అక్టోబర్ 28: గొర్రెలు, మేకల పెంపకం లాభదాయకంగా ఉంటుందని జహీరాబాద్ డీడీఎస్-కేవీకే పశుసంవర్ధక శాస్త్రవేత్త డాక్టర్ కైలాష్ అన్నారు. సోమవారం డీడీఎస్-కేవీకే కేంద్రంలో ఏర్పాటు చేసిన గొర్రెలు, మేకల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల నివారణ చర్యలపై మహిళా రైతులు, పెంపకందారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాలు, బంజరు భూములు ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో గొర్రెలు, మేకల పెంపకం మంచిదన్నారు. పశుగ్రాసాన్ని పెంచుకునేందుకు అనువైన స్థలాలు, సమృద్ధిగా నీరు ఉన్న ప్రాంతాల్లో మేకలు, గొర్రెల పోషణ లాభదాయకంగా ఉంటుందన్నారు. గొర్రెలు, మేకలకు సోకే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్నోకు చెందిన గో ట్రాస్టు నిర్వాహకుడు రజత్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముఖి సైన్స్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్, అక్టోబర్ 28: నవంబర్‌లో రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో చెకుముఖి పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గైని బాలయ్య తెలిపారు. సోమవారం నారాయణఖేడ్‌లో చెకుముకి సైన్స్ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చెకుముఖి పోటీలు నిర్వహిస్తామన్నారు. తెలుగు ఇంగ్లిష్ మీడియంలలో పరీక్షలు ఉంటాయని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సాయితేజ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు

హత్నూర, అక్టోబర్ 28: బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ సెషన్స్ ఫోక్సో జడ్జి జయంతి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ రూపేశ్ తెలిపారు. 27 జూలై 2017న హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పిల్లముల దుర్గాప్రసాద్(24) తన పక్కింటి బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అదేసమయంలో బాలిక తల్లి అక్కడకు చేరుకొని కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. దుర్గాప్రసాద్‌పై హత్నూర పోలీస్‌స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ రాజేశ్‌నాయక్ ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. సెషన్స్ ఫోక్సో జడ్జి జయంతి సోమవారం నిందితుడు పిల్లముల దుర్గాప్రసాద్‌కు 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన అధికారులు అప్పటి ఎస్ఐ రాజేశ్‌నాయక్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్, విచారణ అధికారి ప్రస్తుత ఎస్ఐ సుభాష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ, భరోసా లీగల్ సపోర్ట్ పర్సన్ సౌజన్య, కానిస్టేబుల్ చంద్రశేఖర్, కోర్టు లైజనింగ్ అధికారి వెంకటేశ్వర్, ఎస్ఐ సత్యనారాయణలను ఎస్పీ అభినందించారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 28: డీఎస్సీ-2024 పరీక్షలో మెరిట్ సాధించిన ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ-2024 పరీక్షలో మెరిట్ సాధించిన 1:3 ఎస్‌జీటీ అభ్యర్థుల వివరాలను www.deosangareddy.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ఆయా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 29, 30 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. www.schooledu.telanagana.gov.in వెబ్‌సైట్ నుంచి నిర్ణీత ప్రొఫార్మాను డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించుకొని రెండు జతల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కోహీర్, అక్టోబర్ 28: కోహీర్ పట్టణంలో పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గోపతి సతీశ్ వెల్లడించారు. నమ్మదగిన సమాచారంతో సోమవారం తనిఖీలు నిర్వహించి పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని చెప్పారు. అక్రమ వ్యాపారం చేస్తున్న అఫ్రోజ్, మజర్, ఫరజ్, పెంటయ్యను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హద్నూర్ ఎస్ఐగా చల్ల రాజశేఖర్

జహీరాబాద్, అక్టోబర్ 28: న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ ఎస్ఐగా సోమవారం చల్ల రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. స్థానికంగా పనిచేసిన ఎస్ఐ రామానాయుడు సీఐగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఆయన స్థానంలో మనూర్ ఎస్ఐగా పనిచేసిన చల్ల రాజశేఖర్‌ను హద్నూర్ ఎస్ఐగా నిమమించారు. ఈ మేరకు ఆయన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి పోలీసు సిబ్బంది స్వాగతం పలికి అభినందలు తెలిపారు.

HDFC BANK We understand your world

HDFC బ్యాంక్ లిమిటెడ్

డిమాండ్ నోటీస్

**హెడ్